క్లుప్తంగా

26 నుంచి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్

కమలాపురం : మండల పరిధిలోని ఎర్రగుడి పాడులో ఈనెల 26వ తేదీ నుంచి జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ కురుగాండ్ల చంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు, సాయంత్రం 3 గంటలకు మ్యాచ్‌లు ప్రారంభం అవుతాయని ఆయన అందులో తెలిపారు. గెలుపొందిన విజేతలకు వరుసగా రూ.10వేలు, రూ.6వేలు, రూ.2వేలు, రూ.1000 నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 9849373518 నెంబర్‌కు ఫోన్ చేసి తమ టీం పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : మండల పరిధిలోని దేవరాజుపల్లె గ్రామ సచివాలయం పరిధిలో గురువారం మధ్యాహ్నం 1.30గంటలకు జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ చలపతి ఒక ప్రకటనలో తెలిపారు. మండలస్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆయన తెలిపారు.

సచివాలయాల సిబ్బందికి ఎంపీడీఓ పలు సూచనలు


మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

సింహాద్రిపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో బుధవారం ఎంపీడీఓ కృష్ణమూర్తి సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి సచివాలయ పరిధిలోని హౌసింగ్, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్‌లు, అంగన్‌వాడీ తనిఖీలు, గర్భిణుల సర్వే, ఆధార్ అప్‌డేట్ వంటి విషయాలపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లు రోజువారీ హాజరు వంటి విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో డీటీ వెంకటరెడ్డి, ఈఓఆర్డీ పద్మనాభరెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఫైర్ సేఫ్టీ వారోత్సవాలు

వేముల : మండలంలోని తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టులో నిర్వహించిన ఫైర్ సేఫ్టీ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. నేషనల్ ఫైర్ సేఫ్టీ వారోత్సవాలను ఈనెల 14వ తేదీ నుంచి నిర్వహించారు. ఈ వారోత్సవాలలో హిందీ, ఇంగ్లీషు, తెలుగు మాధ్యమాల పోటీలలో 155 మంది ఉద్యోగులు పాల్గొనగా.. ఇందులో 34 మంది ఉద్యోగులకు ప్రాజెక్టు జీఎం ఎం.ఎస్.రావు, డీజీఎం రామకృష్ణల చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ సూపరింటెండెంట్ విపిన్‌కుమార్ శర్మ, అదనపు సూపరింటెండెంట్ రాజేష్, ఎన్వీ రెడ్డి, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ నాగరాజులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి


16వ డివిజన్‌లో పర్యటిస్తున్న నగరపాలక కమిషనర్

చింతకొమ్మదిన్నె : నగర పరిధిలోని డివిజన్లలో పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని నగరపాలక కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ తెలిపారు. బుధవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఇందిరానగర్, బీఎస్ తాండా, సుబ్బన్నగారిపల్లె గ్రామాల్లో పర్యటించి మాట్లాడారు. 16వ డివిజన్‌లో సీసీ రోడ్లు, స్మశానికి కాంపౌండ్‌ను నిర్మించాలని ప్రజలు కోరినట్లు తెలిపారు. మురుగు కాల్వలలో ఎప్పటికప్పుడు పూడిక తీయాలన్నారు. కార్యక్రమంలో 16వ డివిజన్ వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జి నాగిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, కార్పొరేట్ బి.లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి

జమ్మలమడుగు : బాధితులు సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని కన్నెలూరులో పోలు ఓబులేసుకు వచ్చిన సీఎం సహాయనిధి రూ.లక్షా 80వేల చెక్కును అతని ఇంటికి వెళ్లి అందించారు. మండల పరిధిలోని దేవగుడి గ్రామంలో మురళి అనే రైతుకు సంబంధించిన నేరేటి తాటిచెట్లను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఐ సుబ్బారావుకు సూచించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ధన్నవాడ మహేశ్వరరెడ్డి, తదితరులు ఆయనతో ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక జామియా మసీదు జెండామాను వీధిలో రంజాన్ పండుగ సందర్భంగా బుధవారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌ల ఆధ్వర్యంలో ముస్లిం పేద కుటుంబాలకు 80కిట్ల నిత్యావసర సరుకుల రంజాన్ తోఫాగా అందించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు నూరుల్లా మాట్లాడుతూ ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా కింద నిత్యావసర సరుకులు అందించడం ఆనందించదగ్గ విషయమన్నారు.

వనితకు భరోసా.. మహిళా సమ్మాన్

- తపాలాలో పెట్టుబడులతో ఆర్థికాభివృద్ధి
- మూడు నెలలకొకసారి ఖాతాలో జమ
- ప్రారంభమైన పథకం


పులివెందులలోని ప్రధాన తపాలా శాఖ కార్యాలయం

పులివెందుల టౌన్ : మహిళా సమ్మాన్ బచత్ పత్ర యోజన పథకం ఏప్రిల్ నుంచి తపాలా శాఖలో ప్రారంభమైంది. ఈ పథకంలో వార్షిక ప్రాతిపదికన 7.5 శాతం వడ్డీ లభిస్తుంది. ఇందులో మీ డబ్బును రెండేళ్లపాటు పెట్టుబడి పెట్టవచ్చు. తక్కువ కాల వ్యవధి పెట్టుబడిపై వడ్డీని పొందవచ్చు. దీంతోపాటు ఈ స్కీంలో పెట్టుబడి పెట్టడానికి ఎటువంటి వయో పరిమితిని నిర్ణయించలేదు. ఏ వయస్సులో ఉన్న బాలికలు, మహిళలైనా ఇందులో పెట్టుబడి పెట్టొచ్చు. పథకం మధ్యలో డబ్బు అవసరమైతే పాక్షిక ఉపసంహరణకు అనుమతి ఉంటుంది. మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశ్యంతో పోస్టల్ శాఖ చిన్న మొత్తాల పొదుపు పథకాలను ప్రవేశపెట్టింది. 2023–24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రతిపాదనల్లో మహిళలకు ప్రయోజనం చేకూర్చేందుకు మహిళా సమ్మాన్ బచత్ పత్ర యోజన స్కీం కోసం పోస్టాఫీసులో ఖాతా తెరవొచ్చు.

ఈ పథకంలో రూ.2లక్షల వరకు డిపాజిట్ చేయవచ్చు. దీని కాలపరిమితి 2023 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం చిన్న మొత్తాల పొదుపు పథకాలలో బాలికల కోసం ఉద్దేశించిన సుకన్య సమృద్ధి యోజన పథకానికి 7.60 శాతం, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం కోసం 8 శాతం వడ్డీ రేటు లభిస్తోంది. ఈ రెండు పథకాల తర్వాత అధిక వడ్డీ రేటు ఇస్తున్న పథకం ఇదే కావడం విశేషం.

మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పొందాలనుకునేవారు సమీపంలోని బ్యాంక్, పోస్టాఫీసును సందర్శించి మహిళా సమ్మాన్ బచత్ పత్ర యోజన ఫారంను తీసుకోవాలి. వ్యక్తిగత, ఆర్థిక వివరాలను అందించి దరఖాస్తు పూర్తి చేయాలి. డిపాజిట్ మొత్తాన్ని ఎంచుకుని, నగదు రూపంలోనూ, చెక్కు రూపంలోనైనా డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. పెట్టుబడికి రుజువుగా సర్టిఫికెట్‌ను ఇస్తారు.

ఎంత వడ్డీ వస్తుంది.. :
రెండేళ్లపాటు ఈ పథకం గరిష్ట పరిమితి రూ.2లక్షల వరకు పెట్టుబడి పెడితే.. ఏడాదికి 7.50శాతం వడ్డీ చొప్పున మొదటి ఏడాదిలో రూ.15వేలు, రెండవ ఏడాదిలో రూ.16,125లు.. మొత్తంగా రూ.31,125లు వడ్డీ పొందవచ్చు. సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ విస్ బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ భారతదేశంలో అతిపెద్ద బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రస్తుతం రెండేళ్ల కాల పరిమితి గల ఎఫ్‌డీలపై 6.75శాతం వడ్డీ ఇస్తోంది. అలాగే కొన్ని పెద్ద బ్యాంకులు ఎఫ్‌డీపై అందించే వడ్డీ రేటు కంటే మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ 0.50శాతం నుంచి 1శాతం ఎక్కువ వడ్డీనే అందిస్తోంది. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్‌వంటి కొన్ని బ్యాంకులు రెండేళ్ల కాల పరిమితి గల డిపాజిట్లపై 7.50శాతం వడ్డీ ఆఫర్ చేసుతండగా.. కొన్ని స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు 8 శాతం వడ్డీని కూడా ఆఫర్ చేస్తున్నాయి.

ఈ పథకం మహిళలకు మాత్రమే..



మహిళలు మాత్రే ఈ పథకంతో తక్కువ సమయంలో ఎక్కువ రాబడి పొందేలా ఏడాదికి 7.5శాతం వడ్డీని ఇవ్వనుంది. ఇందులో కనీసం రూ.1000ల నుంచి గరిష్టంగా రూ.2లక్షల వరకు పెట్టుబడి పెట్టుకోవచ్చు. ఒక అకౌంట్ ఓపెన్ చసిన తర్వాత మూడు నెలల తర్వాత మళ్లీ అకౌంట్ ఓపెన్ చేసుకుని అవకాశం కలదు. ఈ పథకం కాలపరిమితి రెండేళ్లు మాత్రమే. ఈ పథకం కింద వడ్డీని ప్రతి మూడు నెలలకొకసారి ఖాతాలో జమ చేయబడును. వివరాల కోసం దగ్గరలోని పోస్టాఫీస్‌ను సంప్రదించండి.
– సురేష్‌బాబు(పోస్టల్ ఇన్‌స్పెక్టర్), పులివెందుల

ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలి


మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : ఎరువులు, పురుగు మందులు ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక 4వ ఆర్‌బీకేలో కమలాపురం డివిజన్ పరిధిలో ఎరువులు పురుగు మందుల దుకాణాదారులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరువులు, పురుగు మందులు ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలన్నారు. మాకు గిట్టుబాటు కాదని, కంపెనీ సూచన మేరకు ఇలా అమ్ముతున్నామని చెప్పవద్దన్నారు. ఎంఆర్‌పీ ధరలకు విక్రయించక పోతే వాటికి జోలికి పోవద్దన్నారు. కాంప్లెక్స్ ఎరువుల వద్ద సమస్య ఏమీ లేదని, యూరియా వద్ద మాత్రం సమస్య వస్తోందన్నారు. ఒక్క రూపాయి అధిక ధరలకు విక్రయించినా సహించేదీలేదన్నారు. ప్రతి ఆర్‌బీకేలో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచుతామన్నారు. ఇప్పటికే ఎరువుల ధరలు తగ్గాయని, ఎరువుల కొరత వచ్చే ప్రసక్తే లేదన్నారు. అలాగే ఇక్కడ ఉన్న దుకాణాదారుల్లో 70 శాతం మంది రైతులేఉన్నారని, మీ పంటలకు ఏ విధంగా పురుగు మందులు వాడతారో రైతులకు కూడా అదే విధంగా ఇవ్వాలన్నారు. స్టాక్ బోర్డు ప్రతి రోజు అప్‌డేట్ చేయాలన్నారు. అలాగే కమలాపురంలో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఉందని, ప్రతి టేడర్ మీరు విక్రయించే దిగుబడులను తప్పని సరిగా ల్యాబ్‌కు పంపి ఉచితంగా టెస్ట్ చేయించుకోవాలన్నారు. డివిజన్ పరిధిలోని ఏఓలు సరస్వతి, సాయిజ్యోతి, శ్యామ్‌బాబు, శ్రీకాంత్‌రెడ్డి, ల్యాబ్ ఏఓ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీలర్లు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పులివెందుల రూరల్ : పట్టణంలోని దినేష్ మెడికల్ సెంటర్‌లో బుధవారం అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఆసుపత్రి సిబ్బంది, ప్రజలకు విద్యుత్, గ్యాస్ వలన జరిగే అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి ఆఫీసర్ రామకృష్ణ ఆధ్వర్యంలో పొగతో నిండిన గదులలో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలి, నీటిలో పడి నీరు తాగి స్పృహ కోల్పోయిన వారికి ప్రథమ చికిత్స ఎలా చేయాలనే విషయాలపై అగ్నిమాపక సిబ్బంది డెమో ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, అగ్నిమాపక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి
జమ్మలమడుగు : ప్రమాదాలు జరిగినప్పుడు వాటి నుంచి రక్షించుకోవటానికి ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఫైర్ స్టేషన్ అధికారి సత్యంరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రుల్లో సిబ్బంది ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సిబ్బందిని కాపాడుకుంటూ మరో వైపు అగ్ని ప్రమాదాన్ని నివారించే ప్రయత్నం చేయాలన్నారు. వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె : అవగాహన, అప్రమత్తతతో అగ్ని ప్రమాదాలను నియంత్రించుకోవచ్చునని అగ్నిమాపక శాఖ అధికారి డి.శివకుమార్ తెలిపారు. అగ్నిమాపక శాఖ వారోత్సవాలలో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అగ్నిమాపక శాఖ, అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులకు బహుమతుల ప్రదానం


ఎలక్ట్రిక్ బైకును అందిస్తున్న జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, తదితరులు

వేంపల్లె : దీపావళి, సంక్రాంతి పండుగల సందర్భంగా హిందుస్తాన్ పెట్రోలియం సంస్థ గృహ మిత్ర పథకంలో భాగంగా సురక్ష అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కడప జిల్లాలోని హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులకు లక్కీడీప్ నిర్వహించి హెచ్‌పి గ్యాస్ వినియోగదారుల ద్వారా ఎంపిక చేశారు. బుధవారం హెచ్‌పీసీఎల్ సేల్స్ మేనేజర్లు సెంథిల్ కిశోర్, అశోక్‌ల సమక్షంలో వేంపల్లె శ్రీసాయి జిత గ్యాస్ ఏజెన్సీలో ఉన్న వినియోగదారురాలు సులోచనకు మొదటి బహుమతి కింద ఎలక్ట్రిక్ బైకు, వేంపల్లె పట్టణానికి చెందిన హెచ్‌పీ గ్యాస్ వినియోగదారురాలు ఎస్.కె.జైబూన్‌కు ద్వితీయ బహుమతి కింద మొబైల్ ఫోన్లను జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

నమ్మకాన్ని వమ్ము చేయని నాయకుడు జగనన్న


సంక్షేమ పథకాలపై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న వీరప్రతాప్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్ర ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయని నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని గోనుమాకులపల్లె, అడవిచెర్లోపల్లె, కొమ్మద్ది గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గోవిందురెడ్డి, పుల్లారెడ్డి, శేఖర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, భయకృష్ణారెడ్డి, ఆంజనేయరెడ్డి, నాగిరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోండి

ఏపీఎంఐపీ పీడీ ఎం.రవీంద్రనాథరెడ్డి


వేముల వద్ద డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ పీడీ రవీంద్రనాథరెడ్డి

వేముల : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ డ్రిప్ పరికరాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ పీడీ రవీంద్రనాథరెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని వేముల, రంగోరిపల్లె, వి.కొత్తపల్లె గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించిన సబ్సిడీ డ్రిప్ పరికరాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆర్‌బీకేల వద్ద స్థానిక వీహెచ్‌ఏ, వీఏఏల వద్ద సూక్ష్మ నీటి, బిందు మరియు తుంపర సేద్య పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు యుద్ధ ప్రాతిపదికన డ్రిప్ పరికరాలను అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు డ్రిప్ పరికరాలను అందిస్తోందని.. ఇప్పటికే అన్ని గ్రామాల్లో స్ప్రింకర్లు, డ్రిప్ పరికరాలను అందిస్తున్నామన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు వెంటనే డ్రిప్ పరికరాలు అందిస్తామని.. ప్రతి ఒక్కరు డ్రిప్ పరికరాలతో వ్యవసాయం చేయడం లాభదాయకమన్నారు. కార్యక్రమంలో ఎంఐ ఏఓలు నాగేష్, మౌళాలి, వీహెచ్‌ఏలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేపు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో (రేపు) శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజీల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

జగనన్న పాలనపై ప్రజలకు అపార నమ్మకం


మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ప్రదర్శిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధి అంబకపల్లె రోడ్డులోని రజక కాలనీ తదితర ప్రాంతాలలో జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి ఆధ్వర్యంలో బుధవారం మా నమ్మకం నువ్వే జగన్ – జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అరుణ, సంపత్, సుభాన్, చలపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు
వేంపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలలో భాగంగా ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు వెదజల్లుతున్నాయని జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుళరెడ్డిలు అన్నారు. బుధవారం ఎస్సీ కాలనీలో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు వెళ్లి గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, నాయకులు ఉత్సాహంగా పాల్గొని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలపై ప్రజా స్పందనను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీగాయత్రి, డైరెక్టర్ మునీర్ బాషా, మండల ఉపాధ్యక్షుడు బాబాషరీఫ్, ఎంపీటీసీ కటిక చంద్రశేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపుత్తలో..
వల్లూరు : మండలంలోని పెద్దపుత్త గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం బుధవారం ఉత్సాహంగా సాగింది. వైఎస్ఆర్‌సీపీ నేతలు పోలు చంద్రశేఖర్‌రెడ్డి, రాజోలు వీరరాఘవరెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కమలాపురం మున్సిపాలిటీ కౌన్సిలర్ రాజోలు నిఖిల్ రెడ్డి, పార్టీ నేతలు లేబాక మునీంద్రారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరులో..
చెన్నూరు : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డిలు తెలిపారు. మండలంలోని శివాలపల్లె పంచాయతీ గోపవరం గ్రామంలో పార్టీ నేతలు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కొండాపురం : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని చౌటిపల్లె పునరావాస కాలనీలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగి ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారికి సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన ఆదేశించారు. పునరావాస కాలనీలో ప్రధానంగా విద్యుత్ సమస్య, తాగునీటి సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు చింతరాజారెడ్డి, చింతా నవజ్యోత్ రెడ్డి, ఉప మండలాధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, వెల్లాల లింగేశ్వర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, సుకుమార్‌రెడ్డి, సర్పంచ్ గోపినాథ్, పి.నారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బాలనాగిరెడ్డి, పెద్దిరెడ్డి, శేఖర్, కొండు రామిరెడ్డి, రామిరెడ్డిపల్లె గ్రామసర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, అల్లం సత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది


వేముల : ర్యాలీలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు

సింహాద్రిపురం : మండల పరిధిలోని కోవరంగుంటపల్లె, గురిజాల గ్రామాల్లో బుధవారం పీఆర్పీ శ్రీనివాసులు, యూనిట్ అధికారి భీమలింగంలు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంభిస్తే రైతులకు పెట్టుబడులు తగ్గడంతోపాటు దిగుబడులు బాగా వచ్చి రైతులు అధిక ఆదాయం పొందవచ్చునన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటల సాగుకు అయ్యే ఖర్చులు కూడా తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో సీసీ వనజాక్షి, ఐసీఆర్పీలు నాగమణి, సులోచన, సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే అధిక ఆదాయం
వేముల : ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేసి అధిక ఆదాయం పొందాలని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి రామ్మోహన్ రైతులకు సూచించారు. బుధవారం ఆయన మండల పరిధిలోని భూమయ్యగారిపల్లె, ముచ్చుచింతలపల్లె, తుమ్మలపల్లె గ్రామాల్లో ప్రృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. రైతుల ఆదాయాన్ని పెంచాలంటే 365రోజులు భూమిమీద పంటలు ఉండేలా పంటల సరళిపైన అవగాహన కల్పించామన్నారు. బ్లాక్ కో ఆర్డినేటర్ శివార్జునరెడ్డి, ఐసీఆర్పీ యోహానందేశ్వరరెడ్డి, బాబు, గ్రామ సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఎన్.పాలగిరిలో ఇఫ్తార్ విందు

వీరపునాయునిపల్లె : మండలంలోని ఎన్.పాలగిరి గ్రామంలోని ముస్లిం సోదరులకు బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేవనూరు జనార్ధన్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ముద్దనూరు : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం ముద్దనూరు యానాది కాలనీలో నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నేటి ఉదయం 6 గంటలనుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొంటారని ఆయన తెలిపారు.

వంటకాల తయారీపై అవగాహన


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

లింగాల : మండలంలోని అక్కులగారిపల్లె గ్రామంలో బుధవారం పులివెందుల ఆహార విజ్ఞాన, సాంకేతిక కళాశాల విద్యార్థులు చిరుధాన్యాల వంటకాల తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాగులతో తయారు చేసిన బిస్కెట్లు, కొర్రలతో తయారు చేసిన కిచిడి తయారీపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ ఎం.ఎస్.భేగ్, అధ్యాపకులు జయమ్మ, నివేదిత, పావన దీప్తి, రామిరెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

సింహాద్రిపురం : యాజమాన్య పద్ధతులతో చీనీ తోటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఉద్యాన శాఖాధికారి మల్లేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని సింహాద్రిపురం, అంకాలమ్మగూడూరు, బలపనూరు గ్రామాల్లో సాగులో ఉన్న చీనీ చెట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చీనీ తోటల్లో ఎక్కువగా వేరుకుళ్లు, బంక తెగుళ్లు ఎక్కువగా ఉందని.. వీటికి వెంటనే సస్యరక్షణ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అరవిందనాథరెడ్డి, వీఏఏ సునైనా, శ్రీదర్, శ్రీలేఖ, ఉష, రైతులు పాల్గొన్నారు.

నేడు బండలాగుడు పోటీలు

సింహాద్రిపురం : మండల పరిధిలోని అంకాలమ్మగూడూరులో వెలసిన అంకాలమ్మ దేవత తిరునాల చివరి వారాన్ని పురస్కరించుకుని గురువారం దేశవు ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ అశోక్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మహేశ్వరరెడ్డి, మాజీ ఆలయ చైర్మన్ సోము కొండారెడ్డిలు తెలిపారు. ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మధురెడ్డి ప్రారంభిస్తారన్నారు. మొదటి బహుమతి కింద రూ.30వేలు, 2వ. రూ.20వేలు, మూడవ. రూ.15వేలు, నాల్గవ. రూ.10వేలు, 5వ. రూ.8వేలు, 6వ. రూ.7వేలు, 7వ. రూ.6వేలు, 8వ.రూ.5వేలు, 9వ. రూ.5వేలు, పదవ. రూ.4వేల చొప్పున నగదు బహుమతులను అందజేస్తారు. పోటీలలో పాల్గొనేవారు 8754928321, 9000625562, 9963566775 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పరుల పట్ల సేవా భావం కలిగిఉండాలి

జమ్మలమడుగు రూరల్ : రంజాన్ మాసంలో పరుల పట్ల సేవా భావం కలిగి ఉండాలని అస్థానయో గౌసియా పీఠాధిపతి సయ్యద్ షా గౌస్‌పీరా ఖాద్రీ (ప్రభుత్వ ఖాజీ), జామీయ మసీద్ పీఠాధిపతి సయ్యద్ షా సాధిక్ పాషా (ప్రభుత్వ ఖాజీ)లు అన్నారు. మంగళవారం లైలతుల్ ఖద్ర్ సందర్భంగా పట్టణంలోని మసీద్‌ల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ మాసంలో సంపద కలిగిన వారు సంపాదించిన దానిలో కొంత మేరకు జకాత్, ఫిత్రా, సదక రూపంలో పేదలకు ఖర్చుచేయాలన్నారు. కార్యక్రమంలో గురువులు సయ్యద్ షా నిజాముద్దీన్ ఔలియా ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామ కల్యాణ మండపం లీజుకు ఆహ్వానం

పులివెందుల : పట్టణంలోని ఉలిమెల్ల రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న శిల్పారామం కల్యాణ మండపంను లీజుకు తీసుకునేందుకు ఆసక్తిగల వారు శిల్పారామ సీఈఓను కానీ, పాడా ఓఎస్డీ కార్యాలయంలో కానీ సంప్రదించాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. రింగ్ రోడ్డు సమీపంలో 10.50ఎకరాల సువిశాల విస్తీర్ణంలో నిర్మించిన శిల్పారామ కల్యాణ మండపాన్ని ఆధునీకరించామన్నారు. మండపాన్ని లీజుకు పొందేవారు తమ సొంత డబ్బులతో మండపాన్ని మరింత ఆధునీకరించుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 9959275479, 9849900961 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు.

సంతాపం

కమలాపురం : స్థానిక నగర పంచాయతీ చైర్మన్ మార్పూరి మేరి బావ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మార్పూరి పెద్ద మస్తానయ్య(50) కడపలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు చైర్మన్ మేరి తెలిపారు. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, నరేన్ రామాంజులరెడ్డిలు కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు.

ఇబ్బందులు లేకుండా చూడాలి

పులివెందుల టౌన్ : రోడ్డు తవ్వకాల పనులతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. బుధవారం పట్టణంలోని స్థానిక తూర్పు ఆంజనేయస్వామి గుడి వద్ద జరుగుతున్న నీటి సరఫరా పైపులైన్ పనులను మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజలు ఇబ్బంది పడకుండా రోడ్డు తవ్వకాల పనులను పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ డీఈ సుభాష్ చంద్రబోస్, టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, ఇంజనీర్లు పాల్గొన్నారు.